ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపలి భాగం

రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న అనంతరం విరామం తీసుకుంటున్న బృందం

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు చేపడుతున్న ఆర్మీ జవాన్లు

రెస్క్యూ ఆపరేషన్‌కు బ్రేక్?

- ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం
- సర్కార్ నిర్లక్ష్యమే కొంప ముంచింది
- ప్రమాదమని తెలిసీ పనులు
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఘటనపై వెలుగులోకి వస్తున్న నిజాలు
- ఆందోళన చెందుతున్న కార్మికులు
- తమ వాళ్లను క్షేమంగా బయటికి తీసుకురావాలని డిమాండ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం) నడుస్తున్నప్పుడు పైనున్న కొండలు అదురుతున్నాయి.. నీటి ఊటలు.. మట్టితో కలిసి పడుతున్నాయి.. ప్రమాదం ఉందని ముందే తెలిసినప్పటికీ.. సర్కార్ ఆదేశాలతో పనులు చేపట్టిన కంపెనీ కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టింది. శ్రీశైలం ఎడమ గట్టు సమీపంలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో జరిగిన ప్రమాదానికి కొద్దిరోజుల ముందు నుంచి ప్రమాదం పొంచి ఉందని తెలిసినప్పటికీ పనులు చేపట్టారని కార్మికులు ఆరోపిస్తున్నారు. సొరంగంలో పైకప్పు కూలి ఎనిమిది మంది చిక్కుకున్నప్పటికీ.. ప్రభుత్వం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినా ఫలితం లేదని భావించి సహాయక చర్యలను నిలిపివేసింది. పరిస్థితి తీవ్రంగా ఉందని.. లోపల ఉన్నవాళ్లు బతికే చాన్స్ లేదని రాష్ట్ర మంత్రి ఒకరు ప్రకటించి చేతులు దులుపుకొన్నారు. లోపల చిక్కుకున్న తమవారి పరిస్థితి ఏంటని కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. వారిని మీడియా ముందుకు రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. జరిగిన వాస్తవాన్ని కార్మికులు వెల్లడించకూడదనే ఉద్దేశంతో ఘటనాస్థలానికి వారిని రానివ్వడం లేదు. మిగతా కార్మికులు ఎక్కడ ఉన్నారో తెలియకుండా, మీడియాకు సమాచారం పొక్కకుండా దాచిపెట్టారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది సిబ్బంది, కూలీల కుటుంబ సభ్యులకు కూడా సమాచారం అందించలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. లోపల చిక్కుకున్న కార్మికులను వెంటనే తీసుకురావాలని, లేదంటే ఆందోళన నిర్వహిస్తామని మిగతా కార్మికులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయి.. సహాయక చర్యలకు అడ్డంకిగా మారాయని చెబుతూ రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. సహాయక చర్యలు చేపట్టినా ఇప్పట్లో ఫలితం ఉండదని పేరు చెప్పని ఒక అధికారి 'నమస్తే తెలంగాణ' ప్రతినిధికి వివరించారు. అందుకే రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మంత్రులు హెలికాప్టర్లలో చక్కర్లు కొడుతూ విహారయాత్రగా మార్చుకున్నారు తప్పితే సహాయక చర్యలపై వారు ఏ మాత్రం సీరియస్‌గా లేరని విపక్షాలు మండిపడుతున్నాయి.

బయటకు తీసుకురావడం కష్టమే

టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకురావడం కష్టసాధ్యంగా మారింది. టన్నెల్ లోపల 11 కిలోమీటర్ల వరకు నీళ్లు నిలిచిపోయాయి. బురద, మెటీరియల్ అడ్డంకిగా మారాయి. రెండుసార్లు టన్నెల్ లోపల పరిస్థితులను పరిశీలించాం. వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం కష్టమే. కానీ ప్రయత్నిస్తాం.

- శ్రీనివాస్‌రెడ్డి, సింగరేణి క్వారీస్ జనరల్ మేనేజర్

నిర్మాణ సంస్థకు ముందే తెలుసా?

ఎస్ఎల్‌బీసీ నిర్మాణంలో ప్రతికూల పరిస్థితులు ఉన్నాయని నిర్మాణ సంస్థకు ముందే తెలుసని కార్మికులు ఆరోపిస్తున్నారు. డ్రిల్లింగ్ చేస్తున్నప్పుడు కొండగుట్టలు సైతం కదులుతున్నాయని.. ఇది పూర్తిగా ప్రమాదకరమని హెచ్చరించినా పనులు చేయాల్సిందేనని తమను పంపించారని కార్మికులు అంటున్నారు. కొండగుట్ట వదులుగా ఉందని.. లీకేజీలు ఎక్కువగా ఉండటంతో డ్రిల్లింగ్ మిషన్ లోపలికి వెళ్లిన కొద్ది పైకప్పుతో పాటు చుట్టుపక్కల మట్టి కూలుతూ వస్తున్నదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ విషయాన్ని నిర్మాణ రంగ సంస్థ ఇంజినీర్లకు కూడా తెలియజేశారు. సర్కారు పనులు చేయమంటున్నది కాబట్టి.. ఎలాగైనా చేయాలని పట్టుబట్టిన కంపెనీ యాజమాన్యం కార్మికుల జీవితాలతో చెలగాటమాడింది. దీని పర్యవసానంగానే సొరంగంలో ప్రమాదం. రెండు కిలోమీటర్ల వరకు మూడు మీటర్ల ఎత్తున నీరు, బురద ఊబికి వస్తున్నట్టు తెలుస్తున్నది. సొరంగం చుట్టూ వేసిన కాంక్రీట్ రింగులు ఫోర్సుపుల్‌గా వస్తున్న నీటి దాటికి నిలబడటంలేదు. కాంక్రీట్ దిమ్మెలు కుప్పకూలాయి. డ్రిల్లింగ్ మిషన్ ముందు ఉన్న వాళ్లు లోపల చిక్కుకుపోగా.. బయటి వారు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బయటపడ్డారు. భారీ శబ్దం చేస్తూ మూడు మీటర్ల మేర పైకప్పు కుప్పకూలడంతో పాటు డ్రిల్లింగ్ మిషన్ వెనక్కు తన్నుకు వచ్చింది. బురదలో మిషనరీ మొత్తం కూరుకుపోవడంతో చిక్కుకున్న వారిని చేరుకోవడం కష్టంగా మారింది. సహాయక చర్యలు చేపట్టిన బృందం వంద మీటర్లకు పైగా డ్రిల్లింగ్ మిషన్ అవతల పూర్తిగా కూలిపోయిందని అంచనాకు వచ్చారు. ఇందులోనే కార్మికులు చిక్కుకొని ఉంటారని భావిస్తున్నారు.

రెస్క్యూ ఆపరేషన్‌కు బ్రేక్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో రెస్క్యూ ఆపరేషన్‌కు ప్రభుత్వం తాత్కాలికంగా విరామం ఇచ్చిందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. రెస్క్యూ బృందాలతో పాటు లోపలికి వెళ్లి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు బయటికి వచ్చాక.. లోపల చిక్కుకున్న వారు బతికి అవకాశం లేదని మీడియాకు తెలిపారు. పరిస్థితి దారుణంగా ఉందని.. సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నదని వివరించారు. రెస్క్యూ ఆపరేషన్ చివరివరకు కొనసాగిస్తామని చెప్పారు. శనివారం ప్రమాదం జరిగితే ఉదయం ఒకసారి లోపలికి వెళ్లి విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించి ఆక్సిజన్‌ను అందించే ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన చోటును గుర్తించలేకపోయారు. అర్ధరాత్రి లోపలికి వెళ్లినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఆదివారం వివిధ బృందాలు సైన్యం సహాయంతో లోపలికి వెళ్లాయి. పరిస్థితిని అంచనా వేసి బయటికి వచ్చి మధ్యాహ్నం లోపలికి వెళ్లి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని గుర్తించారు. ప్రతికూల పరిస్థితులు ఉండడంతో రాత్రి తిరిగి వచ్చారు. మళ్లీ ఎప్పుడు వెళ్లేది ఉన్నతాధికారులు చెప్పడం లేదు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను సమీక్షిస్తున్న ఉన్నత అధికారి మాత్రం పది రోజులకుపైగా పట్టవచ్చని వ్యాఖ్యానించడం గమనార్హం.

తమ వాళ్లను లోపలే వదిలేస్తారా?

ప్రమాదమని తెలిసి తమను లోపలికి పంపించారని, లోపల చిక్కుకున్నవారిని బయటికి తీసుకురావడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని కార్మికులు మండిపడుతున్నారు. ఈ సొరంగ మార్గంలో పనిచేసే కార్మికులంతా ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు చెందినవారే. ఇతర రాష్ట్రాలకు చెందినవారు కావడంతో వారిని కనీసం ఘటన జరిగిన చోటుకు కూడా అనుమతించడం లేదు. కార్మికులు ఉంటున్న చోటును పోలీసులు దిగ్బంధించారు. అసలు లోపల ఏం జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నం చేసినప్పటికీ కార్మికులకు సమాచారం ఇవ్వడం లేదు. దీంతో మండిపడిన కొంతమంది కార్మికులు బయటకు వచ్చి మీడియా ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ వాళ్లను రక్షించి బయటికి తీసుకురాకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఫోర్స్‌పుల్ వాటర్ లీకేజీలే కూలడానికి కారణం

నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణం పనులు 10 ఏండ్లుగా నిలిచిపోయాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మళ్లీ ఈ పథకాన్ని తెరమీదకు తీసుకువచ్చింది. వెంటనే పనులు చేపట్టాలని ముంబైకి చెందిన ఒక కంపెనీకి అప్పగించింది. సొరంగం లోపల 12వ కిలోమీటర్ల నుంచి లీకేజీలు ఎక్కువగా ఉన్నాయి. పైనుంచి ఉబికి వస్తున్న నీరు డ్రిల్లింగ్‌కు ఆటంకంగా మారింది. పరిస్థితి అంచనా వేయకుండా ముందుకు వెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

టన్నెల్ ప్రమాదంపై గవర్నర్ ఆరా

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆరాతీశారు. ఈ విషయమై ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కాంగ్రెసోళ్లు ఇప్పుడేమంటరు?

- మేడిగడ్డ పిల్లర్ కుంగితే నానాయాగీ చేసిండ్రు
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఘటనకు ఎవరు బాధ్యులు?
- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని

కొమురవెల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని

చేర్యాల, ఫిబ్రవరి 23 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ కుంగిపోతే, మొత్తం ప్రాజెక్టు మునిగిపోయిందని నానాయాగీ చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిన ఘటనలో ఏం సమాధానం చెబుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ విషయంలో కాంగ్రెస్ సర్కార్ దుర్మార్గం వ్యవహరించిందని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోసి వాటికి అనుసంధానంగా నిర్మించిన రిజర్వాయర్లకు విడుదల చేస్తే యాసంగిలో సాగునీటి సమస్య ఉండేది కాదని అన్నారు. కేసీఆర్ ఆలోచన విధానంతో నాడు పాలన సాగిందని, దీంతో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నట్టు తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకపోతే ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో సకల వసతులు కల్పించడంతో భక్తులకు వసతి చేకూరడంతో పాటు రూ.20 కోట్ల ఆదాయం పెరిగిందని అన్నారు. కొమురవెల్లి ఆలయాన్ని బీఆర్ఎస్ సర్కారు అభివృద్ధి చేసిందని, మల్లన్నకు స్వర్ణ కిరీటంతోపాటు వెండి సింహాసనం, ఆలయ ద్వారాలకు వెండి తాపడం తదితర శాశ్వత పనులు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలు చేస్తూ చట్టం చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఆక్సిజన్ అందుతున్నదా?

- కత్తిమీద సాములా సొరంగంలో పని
- సాధారణ రోజుల్లోనూ ఊపిరి బిగబట్టాల్సిందే
- నిరంతరాయంగా బయట నుంచే ఆక్సిజన్ సరఫరా
- ఎస్ఎల్‌బీసీలో ప్రస్తుత ప్రమాదంతో లోపలి పరిస్థితి మరింత దారుణం
- ఆందోళనలో సహచర కార్మికులు


సొరంగంలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న రెస్క్యూ టీమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టు సొరంగం కూలిన ఘటనలో చిక్కుకుపోయిన కార్మికులకు ప్రస్తుతం ఆక్సిజన్ అందుతున్నదా? లేదా? అనేది ఉత్కంఠంగా మారింది. ఈ విషయమై సైట్ ఇంజినీర్లతో పాటు కార్మికుల్లో ఆందోళన నెలకొన్నది. సాధారణ సమయాల్లోనే సొరంగంలో పూర్తిస్థాయిలో ఆక్సిజన్ అందదని, ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉన్నదో? అని ఆందోళన చెందుతున్నారు. ఆక్సిజన్‌ను బయటనుంచి నిరంతరం సరఫరా చేస్తున్నామని అధికారులు చెప్తున్నా అది అవతలి వైపునకు చేరుతున్నదా? లేదా? అనేది ప్రశ్నగా మారింది. గాలిని సరఫరా చేసే డక్ట్ సైతం దెబ్బతిన్నదని లోపలికి వెళ్లి వచ్చిన సహాయక బృందాలు చెప్తుండటంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.

సాధారణ సమయాల్లోనే కష్టం

లోతు, పొడవు పెరిగిన కొద్దీ సొరంగంలో ఆక్సిజన్ స్థాయిలు క్రమంగా తగ్గిపోతుంటాయి. సాధారణ సమయాల్లోనూ అలాంటి ప్రాంతాల్లో కార్మికులు పనిచేయడం తీవ్ర కష్టతరమైంది. ఈ నేపథ్యంలోనే ఆక్సిజన్ స్థాయిలు పడిపోకుండా ఉండేందుకు, స్వచ్ఛమైన గాలి వచ్చేందుకు సొరంగాలు నిర్మించే క్రమంలో అక్కడక్కడ వెంటిలేషన్ పాయింట్లను ఏర్పాటు చేస్తుంటారు. అంటే భూ ఉపరితలం నుంచి సొరంగం వరకు డ్రిల్ చేసి షాఫ్ట్‌ను ఏర్పాటు చేస్తారు. అయితే ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ సొరంగానికి సంబంధించి అలాంటి షాఫ్ట్ పాయింట్లు ఎక్కడా ఒక్కటి కూడా లేవు. కారణం సొరంగ ఉపరితలం పూర్తిగా అమ్రాబాద్ టైగర్ అభయారణ్య ప్రాంతంలో విస్తరించి ఉన్నది. ఇక ఎస్ఎల్‌బీసీ సొరంగం భూ ఉపరితలం నుంచి 450 మీటర్లు (దాదాపు అర కిలోమీటర్) దిగువన ఉన్నది. మరోవైపు సొరంగంలో 500 మీటర్లు దాటగానే అక్సిజన్ పరిమాణం తగ్గుతూ ఉంటుంది. ప్రస్తుతం 14 కి.మీ వరకు ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులు పూర్తయ్యాయి. ఆక్సిజన్ స్థాయిలు చాలా తక్కువ. సాధారణంగా నియమిత వాతావరణంలో 19% వరకు ఆక్సిజన్ ఉంటే అది సురక్షితం. ఈ నేపథ్యంలో సొరంగంలో నిర్దిష్ట స్థాయిలో ఆక్సిజన్‌ను ఉంచేందుకు ప్రత్యేక పైపుల ద్వారా బయటనుంచి లోపలికి పంపిస్తున్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలోకి గాలిని సరఫరా చేసేందుకు సైతం 3.1 డయా కలిగిన పైపును సొరంగం పొడవునా ఏర్పాటు చేశారు. గాలిని పంపేందుకు 375 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు ఫ్యాన్లను కూడా నిరంతరం రన్ చేస్తున్నారు. అయినప్పటికీ, ఆక్సిజన్ కావాల్సిన మొత్తంలో అందని పరిస్థితి నెలకొంటుందని ఇంజినీర్లు వివరిస్తున్నారు. లోపల టీబీఎం, ఇతరత్ర డీవాటరింగ్ మోటర్లు రన్ చేయడం వల్ల కూడా ఆక్సిజన్ స్థాయిలు కూడా తగ్గుతాయని చెప్తున్నారు. దీంతో సాధారణ సమయాల్లోనూ కార్మికులు సొరంగంలో నాలుగు గంటల పాటు కూడా పూర్తిసామర్థ్యం మేరకు పనిచేయని పరిస్థితి ఉంటుందని అంటున్నారు.

కార్మికులకు ఆక్సిజన్ అందుతున్నదా?

టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్) పొడవు 120 మీటర్లు. ప్రస్తుతం సొరంగంలో 14వ కి.మీ వద్ద పనులు చేస్తుండగా, అక్కడే ప్రమాదం జరిగింది. మట్టి, సిమెంట్ రింగులు టీబీఎంపై కూలిపోయాయి. కార్మికులు మిషన్‌లోపలే చిక్కుకుపోయారు. మిషన్ వెనక నుంచి సొరంగం పూర్తిగా మూసుకుపోయింది. ఇక టీబీఎంలోనూ స్వల్పంగానే ఖాళీ ప్రదేశం ఉంటుంది. ఇప్పటికీ 40 గంటలు దాటిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో లోపల ఉన్నవారికి ఆక్సిజన్ అందుతున్నదా? లేదా? అనే ఉత్కంఠ నెలకొన్నది. బయట నుంచి ఫ్యాన్ల ద్వారా ఆక్సిజన్‌ను సరఫరా చేసే డక్ట్ సైతం విరిగిపోయిందని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఆక్సిజన్ స్థాయిలు చాలా తక్కువ పరిమాణంలో ఉంటాయని భావిస్తున్నారు. అక్కడ కార్మికులు ఎలా ఉన్నారోనని సహచర కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

క్షణక్షణం ఉత్కంఠ

బాధితులను రక్షించేందుకు ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఆర్డీఎఫ్ ప్రయత్నాలు విఫలం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మందిని రక్షించేందుకు అధికార యంత్రాంగం తీవ్రప్రయత్నాలు కొనసాగిస్తున్నది. ఆదివారం తెల్లవారుజాము నుంచి సహాయ చర్యలు నిర్విరామంగా సాగుతున్నాయి. ప్రమాదం జరిగిన టన్నెల్ 14వ కిలోమీటర్‌కు సమీపంలో 13.5 కిలోమీటర్ల వద్దకు రక్షణ బృందాలు చేరుకున్నా యి. 11వ కిలోమీటర్ల వరకు లోకోట్రైన్‌లో వెళ్లిన సహాయక సిబ్బంది అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లారు. 13.5 నుంచి 14 కిలోమీటర్ల మధ్యలో కార్మికులు చిక్కుకొని ఉంటారని సహాయ బృందాల అధికారులు భావిస్తున్నా రు. అక్కడి పరిస్థితిని అంచనా వేస్తూ సహా యక చర్యలపై నిపుణులతో చర్చిస్తున్నారు.

ఘటన స్థలానికి వెళ్లేదెలా?

టన్నెల్ కుడి, ఎడమ, పైభాగం నుంచి డ్రిల్లింగ్ చేసి, ఘటన స్థలానికి చేరుకునే సాధ్యాసాధ్యాలపై నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. టన్నెల్‌లోని మట్టి దిబ్బలను తొలగిస్తున్నారు. 1000 హార్స్‌పవర్ మోటర్‌తో నీటిని బయటకు పంపుతున్నారు. సహాయ చర్యల్లో 130 మంది ఎన్డీఆర్ఎఫ్, 24 మంది హైడ్రా, 24 మంది సైనికులు, 24 మంది సింగరేణి రెస్క్యూ టీమ్, 120 మంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొంటున్నారు. ఘటన స్థలానికి వెళ్లే దారిలో మట్టి, నీరు అడ్డుపడుతున్నా వాటిని దాటుకుంటూ ముందుకు వెళ్తున్నారు. పైకప్పు కూలిన ప్రాంతానికి 200 మీటర్ల గ్యాప్ ఏర్పడింది. చిక్కుకున్న వారిని పేర్లు పెట్టి పిలిచినప్పటికీ అటువైపు నుంచి ఎలాంటి స్పందనా రావడం లేదని చెప్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము వరకు కొంతమంది మాటలు రెస్క్యూ బృందాలకు వినిపించినట్టు సమాచారం. ఇప్పుడు ఎటువంటి శబ్దాలు వినిపించడం లేదని తెలుస్తున్నది.

ప్రమాదం జరిగిన సొరంగంలో నిలిచిన బురద నీరు

ప్రాణాలతో బయటపడాలని ప్రార్థనలు

సహాయ బృందాల అధికారులు టన్నెల్ బయట అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. ప్రత్యేక వైద్య బృందాలను రప్పించారు. సొరంగంలో ఆక్సిజన్ అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. చిక్కుకున్న తమవారు క్షేమంగా బయటపడాలని బాధిత కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు. సహాయ చర్యలను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్, కర్నూలు కలెక్టర్ సంతోష్, నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్, ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

సొరంగంలో ప్రాణాలు.. చేష్టలుడిగిన సర్కారు

మొదటిపేజీ తరువాయి...

కార్యక్రమాలు చక్కబెట్టుకుంటూ 'అసలు రాష్ట్రంలో టన్నెల్ కూలిన ఘటన ఒకటి జరిగిందా?' అన్న రీతిలో ముఖ్యమంత్రి ఉన్నారని రాజకీయవర్గాల్లోనే ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

ఘటన జరిగి రెండు రోజులు దాటినా..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయి రెండు రోజులు దాటింది. పొట్ట చేతపట్టుకొని బతుకుదెరువు కోసం వచ్చిన సిబ్బంది అందులో కూరుకుపోయారు. వాళ్లు ప్రాణాలతో బయటకు రావాలని ఒక్క తెలంగాణే కాదు.. టన్నెల్‌లో చిక్కుకున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికుల కోసం ఆయా ప్రాంతాల వారు వేయికండ్లతో ఎదురు చూస్తున్నారు. సిబ్బందిని రక్షించేందుకు ఢిల్లీ నుంచి ఆర్మీ, రెస్క్యూ బృందాలు వచ్చాయి. వారంతా అక్కడ కార్మికులను రక్షించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఏం చేయాలి? సమాచారం తెలిసిన వెంటనే ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకొని రక్షణ చర్యలను పర్యవేక్షించాలి. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించారు. టన్నెల్ కుప్పకూలి మట్టిబెడ్డలు, నీళ్లు, కాంక్రీట్ పెచ్చుల కుప్పల కింద 8 మంది ఉద్యోగులు, సిబ్బంది మరణం అంచున ఉన్నా పెద్దగా పట్టించుకోలేదు. కూలిన టన్నెల్ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. బాధ్యతలను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లిపై నెట్టేసి సీఎం రేవంత్‌రెడ్డి తనకెందుకులే అన్నట్టుగా ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పెద్దగా స్పందించిన దాఖలాలేవి?

ఘటన జరిగినప్పటి నుంచి దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి పెద్దగా స్పందించిన దాఖలాలు కనిపించలేదనే విమర్శలున్నాయి. శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో ఘటన జరిగితే దీనిపై సీఎం రెండు, మూడు గంటల తర్వాత స్పందించారు. తక్షణ చర్యలు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించినట్టుగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. మంత్రులు ఉత్తమ్, జూపల్లికి బాధ్యతలు అప్పగించి చేతులు దులిపేసుకున్నారనే విమర్శలున్నాయి. ఆ తర్వాత సీఎం తన పనుల్లో తాను నిమగ్నమైపోయారు. బీసీ నేతలతో సమావేశం నిర్వహణ ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఘటనా స్థలంలో పరిస్థితి దయనీయంగా మారింది. ఎంత వరకు కూలిపోయిందో?, ఎలా కూలిపోయిందో?, అందులో చిక్కుకున్న కార్మికుల పరిస్థితి ఎలాఉన్నదో? తెలియక భయానక వాతావరణం నెలకొన్నది. కానీ సీఎం మాత్రం అప్పటి వరకు ఘటనపై కనీసం సమీక్ష నిర్వహించలేదని తెలిసింది. ఆ తర్వాత ప్రధాన మంత్రి మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించడం, ఫోన్ చేసి ఆరా తీయడంతో సీఎంపై ఒత్తిడి పెరిగినట్టు తెలిసింది. దీంతో రాత్రి సమయంలో హైదరాబాద్‌కు వచ్చిన మంత్రి ఉత్తమ్, వేం నరేందర్‌రెడ్డి ద్వారా అక్కడి పరిస్థితులను సీఎం తెలుసుకున్నారు. కానీ పూర్తిస్థాయిలో అధికారులు, మంత్రులు, ఇతర ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించలేదు.

నేడు ఎన్నికల ప్రచారానికి రేవంత్

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మూడు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం సీఎంవో అధికారులు ముఖ్యమంత్రి పర్యటన వివరాలు వెల్లడించారు. నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో పట్టభద్రులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసే ప్రచార సభల్లో పాల్గొంటారు. ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 11:30 గంటలకు మొదట నిజామాబాద్ చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు మంచిర్యాలకు చేరుకొని సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 4 గంటలకు కరీంనగర్‌కు చేరుకొని ఆ పార్టీ పట్టభద్ర ఎమ్మెల్సీ తరపున ప్రచారం చేస్తారు.

సోషల్ మీడియాలో సెటైర్లు

'టన్నెల్ లోపల చిక్కుకున్నవారిని బయటకు తీయడం కష్టంగా ఉన్నది.. నీటి తీవ్రత ధాటికి టన్నెల్ బోరింగ్ మిషన్ కూడా కొట్టుకువచ్చింది. కిలో మీటర్ మేర నీరు, బురదనే ఉన్నయి' అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించడంపై సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. 'ఒకరేమో 50 మీటర్ల దూరంలో ఉన్నాం అంటరు.. నువ్వేమో కిలో మీటరు అంటున్నవ్.. ఏం గవర్నమెంట్ అయ్యా ఇది..' 'ఏం కర్మరా అయ్యా.. ఇంత చేతగాని వాళ్లను గెలిపించుకున్నం..'.. 'కమిషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలివి'..'ఆ పాపం మీకు తగులుద్ది.. అత్యవసర చర్యలు చేపట్టకుండా ప్రెషర్ పెట్టి పనిచేయించారు.. దాని ఫలితమే ఈ యాక్సిడెంట్'..'తెలుగు చానళ్లు ఎక్కడ?'.. 'ఉదయం 8.30 గంటలకు ప్రమాదం జరిగితే నాకు ఇప్పుడే తెలిసిందంటూ 11.30 గంటల ప్రాంతంలో స్పందించిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి'..'దాదాపు 50 మందికిపైగా సిబ్బంది, కార్మికులు చిక్కుకొని ఇంత పెద్ద ఘటన జరిగితే చీమ కుట్టినట్టు కూడా లేకుండా బీసీ నేతలతో సమావేశాలు అంటూ గడుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి'.. అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు సెటైర్లు పేలుస్తున్నారు.

హుటాహుటిన హైదరాబాద్‌కు కోమటిరెడ్డి

'ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేయడమే నా జీవిత లక్ష్యం' అని డబ్బా కొట్టిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. ఇప్పుడు టన్నెల్ కూలి 8 మంది ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నా ఆయన పత్తాలేకుండాపోయారు. ప్రమాదం జరిగి రెండు రోజులు గడిచినా ఆయన జాడ కనిపించడం లేదు. ఎస్ఎల్‌బీసీ తన చిరకాల స్వప్నమని పదే పదే చెప్పుకునే ఆయన, కూలిన ట